క్లుప్తంగా

మాజీ సీఎంకు ఘన స్వాగతం



ఎర్రవల్లి: మండల కేంద్రంలో గురువారం పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకుడు నారాయణ్‌స్వామికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలో జరిగే పార్టీ సమావేశానికి వెళ్తుండగా ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎమ్మెల్సీ అమీర్‌అలీఖాన్, జిల్లా ఇన్‌చార్జ్ సంధ్యారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సరిత తిరుపతయ్యలు కూడలిలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దొడ్డెప్ప, నీలి శ్రీనివాసులు, రాజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

కేటీదొడ్డి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద 2025–26 సంవత్సరానికి రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నట్లు ఏఓ రాజవర్ధన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు సన్న, చిన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీ, జనరల్ కేటగిరీలో 40 శాతం సబ్సిడీతో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్ తదితర పత్రాలతో ఏఈఓలకు ఈ నెల 22వ లోపు దరఖాస్తు చేసుకోవాల్సిగా కోరారు.

ఆకలి చావులు లేకుండా చూడాలి



గట్టు: రాష్ట్రంలో ఎవరు కూడా ఆకలితో చావకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ జిల్లా కోఆర్డినేటర్ నర్సింహులు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు గురువారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం సీఎం రేవంత్‌రెడ్డికి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ.. ప్రపంచ ఆహార దినోత్సవం కాదని, ఆకలి దినోత్సవమన్నారు. రాష్ట్రంలో ప్రతికూలీకి, పేదలకు ఉపాధి కల్పించాలని, తద్వారా ఆకలి చావులు లేకుండా చేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి ఉపాధి, ఆహార భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్వరి, లక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలి

గద్వాల: జిల్లాలో ప్రజలు విద్యా, ఉపాధి, వైద్య పరంగా వెనుకబాటు తనంతో ఇబ్బందులు పడుతున్నారని సీనియర్ సిటీజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు అన్నారు. గురువారం ఆయన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏఐసీసీ పరిశీలకుడు పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణ స్వామిని గద్వాలకు వచ్చిన నేపథ్యంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల్లో భాగంగా గద్వాల ప్రాంతం విడిపోవడంతో అభివృద్ధిలో వెనకబాటుకు గురైందన్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

మానవపాడు: మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ చంద్రకాంత్ హెచ్చరించారు. గురువారం మండలంలోని జాతీయ రహదారి– 44పై మానవపాడు స్టేజి సమీపంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్నా జరిమానా ఉంటుందన్నారు.మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



ఎర్రవల్లి: ఎరువులు, పురుగు మందుల విక్రయ డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించి క్రయ, విక్రయాలు జరపాలని మండల వ్యవసాయ అధికారి సురేష్‌గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని తిమ్మాపురం రైతువేదికలో ఏర్పాటు చేసిన డీలర్ల సమావేశంలో ఇటిక్యాల ఏఓ రవికుమార్‌తో కలిసి హాజరై మాట్లాడారు. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు రశీదులతో పాటు స్టార్ రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పలువురు డీలర్లు పాల్గొన్నారు.



తిమ్మాపురంలో సేరిపెద్ద చెరువు



కోతకు గురై ఎండిన ఇటిక్యాల లింగమ్మ చెరువు

చెరువులకు రక్షణేది?

- ఆక్రమణకు గురవుతున్న భూములు
- మండలంలో 44 చెరువులు
- 16 ఏళ్లుగా నీటి సంఘాల జాడలేదు
- ప్రతి ఏటా తగ్గుతున్న నీటి నిల్వలు



కంపచెట్లతో దర్శనమిస్తున్న కొండేరు లచ్చమ్మ చెరువు

ఎర్రవల్లి: చెరువుల్లో నీటి నిల్వలను పెంచి వాటిని అభివృద్ధి చేయడం కోసం గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ కాకతీయ పనులు చేపట్టింది. గ్రామాల్లోని చెరువులను, కుంటలను శుభ్రం చేసి పునరుద్ధరించింది. కానీ నీటి సంఘాలకు పాలకవర్గాలు లేకపోవడంతో చెరువు భూములు ఆక్రమణకు గురైనా పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఇప్పటికే మండలంలో చాలా చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెరువులపై పర్యవేక్షణ ఇలా..

సాగునీటి సంఘాలకు వందల ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువుల ఆయకట్టు రైతులు చైర్మన్‌తో పాటు డైరెక్టర్లను ఎన్నుకునేవారు. ఎన్నిక కాబడిన పాలకవర్గ సభ్యులు చెరువులు, కుంటల నిర్వహణతో పాటు నీటిని పంట పొలాలకు విడుదల చేయడంతో పాటు నీటిని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకుంటారు. కానీ దాదాపుగా 16 ఏళ్లయినా ప్రభుత్వాలు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువులు భూములు ఆక్రమణకు గురవతున్నాయి.

నీటి సంఘాల ఎన్నికల జాడేలేదు..

ఉమ్మడి ఇటిక్యాల మండలంలో వంద ఎకరాల ఆయ కట్టు, అంతకంటే తక్కువ ఆయకట్టు ఉన్న చెరువులు, కుంటలు మొత్తం 44 ఉన్నాయి. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఉన్న మొత్తం చెరువులు 2,256 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2006లో రాష్ట్ర వ్యాప్తంగా సాగునీటి సంఘాలకు ఎన్నికలను నిర్వహించింది. 2008 లోనే వారి పదవీ కాలం ముగిసింది.కానీ అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వాలు మారినా సాగునీటి సంఘాలకు తిరిగి ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు లేవు.

ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులు

గత ప్రభుత్వం ప్రతి చెరువులో కూడా మిషన్ కాకతీయ పనులను చేపట్టింది. కానీ నీటి సంఘాలు లేకపోవడంతో కాంట్రాక్టర్లు కూడా పనులను తూతూ మంత్రంగా చేసి చేతులు దులుపుకొన్నారు. అదే విధంగా చెరువులపై పర్యవేక్షణ లేకపోవడంతో మత్స్యశాఖ అధికారులు కూడా నామమాత్రంగా చేప పిల్లలను వదిలి చేతులు దులుపుకుంటున్నారు. అరకొరగా వదిలిన చేపలు కూడా సక్రమంగా పెరగకపోవడంతో చెరువుపై ఆశలు పెట్టుకున్న మత్స్యకారుల కుటుంబాలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చెరువులు, కుంటల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి వాటిని మరింత అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువులను అభివృద్ధి చేయాలి



నీటి సంఘాలను ఎన్నుకోవడం వల్లే చెరువులు అభివృద్ధి చెందుతాయి. ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులను అభివృద్ధి చేసింది. కానీ కాంట్రాక్టర్లు చెరువులలోని పూడిక పనులను సక్రమంగా చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చెరువులను అభివృద్ధి చేయాలి.

– పెద్ద మద్దిలేటి, మత్స్యకారుడు, జింకలపల్లి

ఆదేశాలు వస్తే..



చెరువులకు నీటి సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తప్పకుండా నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తాం. గతంలో చెరువుల అభివృద్ధి పనులు నీటి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు చూసుకునేవారు. చెరువు పరిధిలో ఉన్న ఆయకట్టు రైతులు చెరువులను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

– నరేష్, తహసీల్దార్

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు, విద్యార్థులు

అయిజ: మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి వసతి గృహాలు నిర్మించాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా కో ఆర్డినేటర్ పల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో కలిసి బీఆర్‌ఎస్వీ నాయకులు కొత్త బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుటు ధర్నా చేసి తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని, కనీసం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదని మండిపడ్డారు. మండల కేంద్రం 70 గ్రామాలకు అనుబంధంగా ఉందని, 9 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయని, వెయ్యి మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని, ఇంత వరకు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయలేదన్నారు. విద్యార్థుల డిమాండ్లు నెరవేర్చకుంటే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తులసిగౌడ్, రాజు, అశోక్‌గౌడ్, రామాంజనేయులు, ప్రవీణ్, ఆదికేశవ్, నరేష్, రమేష్, నరసింహ, విద్యార్థులు పాల్గొన్నారు.

మినీ ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ: మండల కేంద్రంలో మినీ ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, బీజేపీ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. అయిజ బస్టాండ్ నుంచి ప్రతిరోజు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, వివిధ జిల్లాలకు 150 బస్సులకు పైగా రాకపోకలు జరుపుతాయన్నారు. అయిజ ఆర్టీసీ బస్టాండ్ నుంచి అద్దెల ద్వారా రూ. 90 లక్షలకు పైగా ఆదాయం సమకూరుతున్నా ప్రయాణికులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని మండిపడ్డారు. ప్రజల భద్రత కోసం ఆర్టీసీ ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సీసీరోడ్లు నిర్మించాలని, తాగునీటి వసతి కల్పించాలని, రద్దీ ప్రదేశాల్లో బస్‌షెల్టర్లు నిర్మించాలని కోరారు. నాలుగు సంవత్సరాలుగా సింధనూరు, మాన్‌దొడ్డి, తూంకుంట, గట్టు రూట్లలో బస్సులు నడపకపోవడం వలన విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వీరయ్యాచారి, వివిధ గ్రామాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సామూహిక సీమంతం

అలంపూర్ రూరల్: అలంపూర్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసంలో భాగంగా పోషణపై అవగాహన కల్పించి, సామూహిక సీమంతాలు నిర్వహించారు. సీడీపీఓ అనురాధ, సూపర్‌వైజర్ నర్గీస్ హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివ రించారు కార్యక్రమంలో టీచర్లు ఎమెలమ్మ, నర్మద, మాధవి, పుష్పావతి, శాంతమ్మ, రూపప్రియ, లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.



అపార్ ప్రక్రియ పూర్తి చేయాలి




ధరూరు: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల అపార్ కార్డుల ప్రక్రియ వారం రోజుల్లోగా పూర్తి చేయాలని కాంప్లెక్స్ జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి అన్నారు. పాఠశాలల సందర్శనలో భాగంగా గురువారం ఆయన మండల పరిధిలోని భీంపురం యూపీఎస్, పెద్దపాడు ప్రాథమిక పాఠశాలలను ఆయన పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. పలు పాఠ్యాంశాలను విద్యార్థులచే సాధన చేయించాలని, నిర్ణీత సమయానికి సిలబస్‌ను పూర్తి చేయాలన్నారు. 100 శాతం అపార్ కార్డుల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంతో పాటు విద్యార్థులకు రాగిజావ అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

200 పని దినాలు కల్పించాలి



మల్దకల్: ఉపాధి హామీ కూలీలకు సంవత్సరంలో 200 పని దినాలు కల్పించాలని, పనికి తగిన కనీస వేతనం రూ.920గా ప్రభుత్వం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ సంఘం మహిళా కార్యదర్శి పద్మ డిమాండ్ చేశారు. గురువారం ప్రపంచ ఆహార దినాన్ని ఆకలి దినంగా నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఝాన్సీరాణికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నయ్య, గంగమ్మ, బీసమ్మ, కవిత, సాయిలు, బుచ్చన్న , పరుశరాము పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంపై అధికారుల ఆరా



మల్దకల్: మండలంలోని కుర్తిరావులచెర్వు జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలో నిలిచిపోయిన మధ్యాహ్న భోజనంపై గురువారం ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ ఆరా తీశారు. వంట చేసే మహిళలకు పూర్తి బిల్లులు రావడం లేదన్న కారణంతో మధ్యాహ్న భోజనం నిలిపివేసినట్లు వారు ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఏజెన్సీ మహిళలు స్పందించకపోవడంతో మహిళా సంఘాల సభ్యులను సంప్రదించారు. ప్రత్యామ్నాయంగా విద్యార్థులకు శుక్రవారం నుంచి మధ్యాహ్న భోజనం అందే విధంగా చర్యలు తీసుకుంటానని ఇన్‌చార్జ్ ఎంఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఉండవెల్లి: తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా రెండో మహాసభలను అలంపూర్ చౌరస్తాలో నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17న జరగనున్న మహాసభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

అలంపూర్: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. అనంతరం పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. మున్సిపల్ కమిషనర్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ప్రజలు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని కానీ పాలకులు సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదని మండిపడ్డారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం లేదన్నారు. అక్బర్‌పేటలో వర్షపు నీరు రోడ్లపై నిలిచి లోతట్టు ఇళ్లు ముంపునకు గురువుతున్నట్లు తెలిపారు. న్యూ ప్లాట్స్ కాలనీలోని దళితులకు స్మశాన వాటికకు స్థలం కేటాయించాలన్నారు. స్మశాన వాటిక లేక కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. తుంగభద్ర నదిఒడ్డున ఉన్న స్మశాన వాటికకు సీసీరోడ్డు వేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. ఐదేళ్లుగా మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న 16 మందిని కార్మికులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు అలీ అక్బర్, ప్రధాన కార్యదర్శి ఆశన్న, కేవీపీఎస్ నాయకులు వెంకటస్వామి, అయ్యప్ప, మౌలాలి, సిద్దయ్య, వెంకటేశ్వర్లు, విశ్వం తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



అలంపూర్‌లో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఏఎన్‌ంలు, ఆశాలు

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ హరిజనవాడ పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఏఎన్ఎం శ్యామల సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 13 నుంచి 17 వరకు సీపీఆర్ వారంగా నిర్వహిస్తుందన్నారు. గుండె ఆగిన సమయంలో తక్షణ స్పందన ఎలా ఇవ్వాలో తెలియజేయడం, ప్రాణ రక్షణ శృంఖలాన్ని ప్రారంభించేందుకు అవసరమైన దశలు వివరించారు. సీపీఆర్ అనేది అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు రక్షించే కీలక ప్రక్రియన్నారు. కార్యక్రమంలో హెచ్ఎ బాలీశ్వరయ్యశెట్టి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు

శాంతినగర్: సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడవచ్చని 108 ప్రోగ్రాం మేనేజర్ రత్నమయ్య అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 108 ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి వ్యక్తి సీపీఆర్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఓబులేష్, నవీన్‌కుమార్, ఆనంద్, పైలెట్లు సతీష్, హనుమంతు పాల్గొన్నారు.

టీచర్లు అర్థమయ్యేలా బోధించాలి



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గట్టు: విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునే విధంగా పాఠాలు బోధించాలని ఎంపీడీఓ చెన్నయ్య ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలో శిక్షణా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న బోధన పరికరాలను ఉపయోగించుకొని బోధన సాగించాలని కోరారు. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులను సులభరీతిలో బోధించాలని కోరారు. పూర్తిస్థాయిలో ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాలను సాధించాలని కోరారు. ఇన్‌చార్జ్ ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాల్లో నేర్చుకున్న వాటిని తరగతి గదుల్లో అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆపరేషన్ మేనేజర్ కాశీనాథ్, ఇన్‌చార్జ్ ఎంఈఓ వెంకటేశ్వర్లు, జీహెచ్ఎం నల్లారెడ్డి, జిల్లా రిసోర్స్‌పర్సన్ ఆగస్టిన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు



రాజోళి పోలీస్ స్టేషన్‌లో వీఓఏలు

ఇటిక్యాల/రాజోళి/ఉండవెల్లి/అలంపూర్ రూరల్: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని జిల్లా వీఓఏల అధ్యక్షుడు శివశంకర్ అన్నారు. గురువారం హైదరాబాద్ చలో సెర్ప్ కార్యాలయం ముట్టడిలో భాగంగా వీఓఏలను ముందస్తు అరెస్టు చేసి వారిని ఇటిక్యాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ.. వీఓఏల కనీస వేతనం రూ. 20వేలు ఇవ్వాలన్నారు. 58 జీఓను వెంటనే రద్దు చేయాలన్నారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని తెలిపారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెలా వేతనాలు వీఓఏల వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలని పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో హనుమంతు. శ్రీనివాస్ రెడ్డి, సత్యారెడ్డి తదితరులు ఉన్నారు.

- అక్రమ అరెస్టులతో హక్కులను కాలరాయలేరని వీఓఏ మండల అధ్యక్షుడు రేపల్లె రాజేష్ అన్నారు. హైదరాబాద్‌లోని సెర్ప్ కార్యాలయం ముట్టడికి వెళ్తున్న క్రమంలో ఉద్యోగులను అరెస్టు చేసి రాజోళి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో రజియా బేగం, సుధీర్, శేఖర్, హనుమంతు, కృష్ణయ్య తదిదరులు ఉన్నారు.
- ఉండవెల్లి మండల కేంద్రంలోని 10 మంది వీఓఏలను ముందస్తు అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.
- అలంపూర్ మండల పరిధిలో వీఓఏలను ముందస్తు అరెస్టు చేసినట్లు వీఓఏ అధాకర్ నాయుడు తెలిపారు. అరెస్టయిన వారిలో జానకిరాముడు, అబ్దుల్ నబీ, సీతమ్మ, పావని, మధు, కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

అలంపూర్: కర్నూలులో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు జిల్లా పంచాయతీరాజ్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని మండలాల్లో చేపట్టిన పనులు, చేపట్టాల్సిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనుల వివరాల గురించి వాటి ప్రతిపాదనలపై చర్చించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



ఉప్పేరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఏజెన్సీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను పాఠశాలకు రప్పించాలి

గట్టు: బడి మానేసిన పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడికి రప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని గట్టు కాంప్లెక్స్ హెచ్ఎం నల్లారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. రాయాపురం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి ఆయన మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ తరగతి గదులు పరిశీలించారు. వంట గది పరిసరాలు, కూరగాయలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అశ్విని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ఇటిక్యాల: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని కొత్తదేవపల్లి ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలు, వంటగదులు, తరగతి గదుల నిర్వహణ పనితీరును పరిశీలించారు. విద్యార్థులతో చతుర్విధ ప్రక్రియలు చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి తరలిస్తే చర్యలు

ధరూరు: వాహనదారులు పరిమితికి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ శ్రీహరి హెచ్చరించారు. నర్సన్‌దొడ్డి చౌరస్తాలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతరం బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.